# చూడచక్కని చిట్టడవులు

## ప్రకృతి వనాలతో పచ్చగా మారిన పల్లెలు



రాజాపేట మండలంలోని రేణిగుంటలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం

> పల్లె ప్రజలకు స్వచ్ఛమైన గాలి, వాతావరణం
> ప్రకృతి వనాల్లో సేద దీరుతున్న జనం
> జిల్లాలో 650 ఆవాసాల్లో పల్లెప్రకృతి వనాలు
> ఒక్కో వనానికి రూ.10 లక్షలు ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

యాదగిరిగుట్ట, నవంబర్ 15 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పల్లెల పరిస్థితి అధ్వానంగా ఉండేది. పచ్చదనం కరువై గ్రామాలు మోడు బారినట్లుగా కనిపించేవి. సరైన రోడ్లు లేక, వాటి వెంట చెట్లు లేక కళావిహీనంగా ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ పల్లెల రూపురేఖలు మార్చారు. చెట్లతోనే మనిషి మనుగడ సాధ్యమని భావించి హరిత యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. హరితహారంలో భాగంగా విరివిగా మొక్కలు నాటడంతో పాటు పల్లెల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని 421 గ్రామ పంచాయతీలు, 229 ఆవాస గ్రామాల్లో రూ.6.65 కోట్లతో 650 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పల్లె ప్రకృతి వనానికి రూ.10 లక్షలు ఖర్చు చేసి పార్కుల్లా తీర్చిదిద్దారు. పల్లెప్రకృతి వనాల్లో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లతో ప్రజలంతా వాకింగ్ చేస్తూ స్వచ్ఛమైన వాతావరణంలో సేద దీరుతున్నారు.

### నీతి ఆయోగ్ ప్రశంసలు

పల్లె ప్రకృతి వనాలతో జీవవైవిధ్యం పెరిగిందని నీతి ఆయోగ్ గుర్తించింది. పక్షులు, పురుగులు, సీతాకోక చిలుకలు పెరిగాయని, కార్బన్ ఫిక్సేషన్, భూమిలోనూ కార్బన్ నిల్వలు విపరీతంగా పెరిగాయని వెల్లడించింది. భూమి, నీటి పరిరక్షణ చర్యలకు తోడ్పాటు, ఉత్తమ బయో హార్వెస్టింగ్ నిర్మాణాలు మారాయని తెలిపింది.

### పల్లెలకు పచ్చనిహారం..

పల్లెప్రకృతి వనాలతోపాటు ప్రతి గ్రామంలో విరివిగా మొక్కలు నాటడంతో గ్రామాలకు పచ్చని హారాన్ని తొడిగినట్టుగా కనిపిస్తున్నాయి. జిల్లాలోని 421 గ్రామ పంచాయతీలు, 229 ఆవాసాలు కలుపుకొని 650 గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పల్లెప్రకృతి వనానికి రూ.10 లక్షలు ఖర్చు చేసి వాకింగ్ ట్రాక్, పొడవు జాతి, చిన్న జాతి మొక్కలతో పాటు ఔషధ మొక్కలు నాటారు. ఎకరం స్థలంలో 4వేల మొక్కలు నాటడంతో అవి నేడు పెద్దవై చిట్టడవులను తలపిస్తున్నాయి. ప్రజలు వాకింగ్ చేసేందుకు వాకింగ్ ట్రాక్‌లను కూడా ఏర్పాటు చేసి చుట్టూ తంగేడు, అడ్డసారం, పారిజాతం, తిప్పతీగ, పొడపత్రి, పెద్ద నిమ్మ, వేప, జామ, అల్లనేరేడు వంటి మొక్కలు నాటారు. ప్రతి గ్రామ పంచాయతీకి కేటాయించిన 10 శాతం గ్రీన్ బడ్జెట్ నుంచి పల్లెప్రకృతి వనాల నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.


ఆత్మకూరు(ఎం) మండలంలోని రాఘువాపురంలో పల్లె ప్రకృతి వనం


మోటకొండూర్ మండలం దిలావర్‌పూర్‌లోని పల్లె ప్రకృతి వనం

ముఖ్యమంత్రి కేసీఆర్ ఏది తలపెట్టినా తరతరాలు నిలిచిపోయే విధంగా ఉంటాయి. అందులో భాగమే గ్రామాల్లో చేపట్టిన పల్లెప్రకృతి వనాలు. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమయ్యే పార్కులు, ప్రస్తుతం గ్రామాల్లో ఏర్పాటయ్యాయి. పల్లెప్రకృతి వనాలతో గ్రామాలన్నీ పచ్చని చెట్లతో హరిత శోభను సంతరించుకున్నాయి. పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. గ్రామాల మధ్య పల్లెప్రకృతి వనాలు ఉండడంతో ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడింది. వాటిల్లో పల్లె జనం వాకింగ్ చేస్తూ ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నారు.

# రేణికుంట రాజసం

రాజాపేట మండలంలోని రేణికుంట గ్రామ పంచాయతీ పల్లె ప్రగతిలో ముందువరుసలో నిలిచింది. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సహకారంతో గ్రామ సర్పంచ్ బూర్గు భాగ్యమ్మానర్సిరెడ్డి గ్రామాన్ని కోటి రూపాయలతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైకుంఠధామం, డంపింగ్ యార్డు, పల్లె పకృతి వనం, సీసీ రోడ్లు చూడచక్కగా దర్శనమిస్తున్నాయి. దాంతో గ్రామపంచాయతీ రెండుసార్లు జిల్లాస్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు అందుకోవడం విశేషం.

– రాజాపేట, నవంబర్ 15


రేణికుంటలోని ఓ వీధిలో వేసిన సీసీ రోడ్డు


వైకుంఠ ధామం

# తాగునీటికి తండ్లాట తీరింది

సమైక్య పాలనలో రాజాపేట మండలంలోని పుట్టెగూడెం వాసులు తాగునీటి కోసం ఎన్నో తంటాలు పడ్డారు. గుక్కెడు నీటి కోసం బిందెలు పట్టుకొని కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకున్నారు. నాలుగైదు రోజులకు ఒకసారి వచ్చే నీటి కోసం నల్లా వద్ద బిందెలు పట్టుకొని గొడవలు పడ్డారు. దాహంతో అల్లాడుతున్నామని, మంచినీటి కష్టాలు తీర్చాలని గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసలు చేసిన సంఘటనలూ ఉన్నాయి. కానీ, నేడు స్వరాష్ట్రంలో ప్రజల తాగునీటి కష్టాలు తీర్చాలనే గొప్ప సంకల్పంతో సీఎం కేసీఆర్ అపర భగీరథుడిలా మిషన్ భగీరథ ద్వారా గడపగడపకూ నల్లాల ద్వారా తాగునీటిని అందిస్తూ తాగునీటి కష్టాలు తీర్చారు. ఉదయం లేవగానే ఇండ్ల ముంగిటికే వచ్చే నీటిని ఆనందంగా పట్టుకుంటున్నారు.

–రాజాపేట, నవంబర్ 15


నాడు వ్యవసాయ బావి వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న పుట్టెగూడెంవాసులు


నేడు పుట్టెగూడెంలో ఇంటి వద్దే నీళ్లు పట్టుకుంటున్న గిరిజన మహిళ


నేడు పుట్టెగూడెంలో నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంక్